క్లుప్తంగా

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని నందికంది శివారులో చోటుచేసుకుంది. సదాశివపేట సీఐ మహేష్ ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం... జహీరాబాద్ మండలం రంజోల్‌కు చెందిన మోముల సోమిరెడ్డి (51) బీరంగూడలో నివాసం ఉంటూ ఎంఆర్ఎఫ్ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం కొండాపూర్ మండలం అంతాయిపల్లిలో ఉండే తన అన్న వద్దకు వెళ్లి తిరిగొస్తున్నాడు. శనివారం అర్ధరాత్రి ముంబై జాతీయ రహదారి నందికంది శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొనగా బలమైన గాయాలై మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



నారాయణఖేడ్‌లో..

నారాయణఖేడ్: సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన చెక్కులను ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి.. బాధితురాలి కుటుంబీకులకు అందజేశారు. ఆదివారం మనూరు మండలం మాయికోడ్‌కి చెందిన సౌజన్యకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ. 29,500 ఆర్థిక సహాయం మంజూరైంది. బీఆర్ఎస్ ఖేడ్ పట్టణ అధ్యక్షుడు నగేశ్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు లయక్, నాయకులు నాగేందర్, సుధాకర్, రాజు, మన్నాన్, ప్రశాంత్‌సాగర్, ప్రమోద్‌గౌడ్, మహేందర్ గౌడ్ పాల్గొన్నారు.

మునిపల్లి(అందోల్): ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చొరవతో మండలకేంద్రానికి చెందిన పోతురాజు, అరుణకు రూ. 60 వేల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ నాయకులు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో రాజు పాటీల్, పరమేశ్వర్‌రావు, మహేందర్ పాండు, వంశీ, రాకేశ్, రాహుల్‌తో పాటు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు



హోమం కార్యక్రమాలను నిర్వహిస్తున్న అర్చకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈనెల 20 తేదీ వరకు జరిగే పవిత్రోత్సవాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ కోరారు.

108లో ప్రసవం

నర్సాపూర్ రూరల్: మండలంలోని ఇబ్రహీంబాద్‌కు చెందిన మహిళకు 108 సిబ్బంది డెలివరీ చేశారు. గ్రామానికి చెందిన నరేష్ భార్య అనూష ఏడు నెలల గర్భవతి. ఆమెకు అనారోగ్యంగా ఉండడంతో శనివారం నర్సాపూర్ ఏరియా ఆస్పత్రిలో చేర్చారు. ఆదివారం ఉదయం 4 గంటలకు ఆమెకు పురిటి నొప్పులు రావడంతో చికిత్స కోసం సంగారెడ్డి ఆస్పత్రికి తరలించాలని డాక్టర్లు సూచించారు. 108 అంబులెన్స్‌లో సంగారెడ్డికి తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు తీవ్రమయ్యాయి. దీంతో 108 సిబ్బంది వాహనంలోనే డెలివరీ చేశారు. నెలలు నిండక ముందే పాప జన్మించినా తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు సిబ్బంది అలీమ్, రమేశ్ తెలిపారు.

సర్వాయి పాపన్నకు నివాళి



సంగారెడ్డిలో...



హత్నూర: దేవులపల్లిలో పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



నారాయణఖేడ్: కాంగ్రెస్ నేతల ఆధ్వర్యంలో..

జిల్లావ్యాప్తంగా సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని జరిపారు. పలు ప్రాంతాల్లో ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు ఆయా పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గౌడ సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, సామాజిక సేవా సంఘాల నాయకులు పాల్గొన్నారు. పాపన్నగౌడ్ ఆశయాల స్ఫూర్తితో నేటి తరం యువత మెరుగైన సమాజం కోసం కృషి చేయాలన్నారు.

– నెట్‌వర్క్



సంగారెడ్డి రూరల్‌లో..



వట్‌పల్లిలో..



జహీరాబాద్‌లో..



సదాశివపేటలో

ఆరోగ్య మిత్రల సమ్మె బాట

- ఈనెల 20 లోగా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్
- ఇప్పటికే నోటీసు అందజేత
- 16 ఏళ్లుగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా సేవలు

సమస్యలు పరిష్కరించడంతో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆరోగ్య మిత్రలు సమ్మె బాట పట్టనున్నారు. ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా పని చేస్తున్న వీరు 16 ఏళ్లుగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా సేవలు అందిస్తున్నారు. ఎన్నో సార్లు సమస్యలు పరిష్కరించాలని ఆందోళనలు చేసినా విన్నపాలు విన్నవించినా ఫలితం లేకపోయింది. దీంతో ఈనెల 20వ తేదీ లోగా పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం దిగిరని పక్షంలో సమ్మె చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. అందులో భాగంగా ఈ నెల 6న సమ్మె నోటీసు ఇచ్చారు.

జోగిపేట (అందోల్): 2007లో ఆరోగ్యశ్రీ స్కీంను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 900 మంది ఆరోగ్య మిత్రలను నియమించింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో 50 మంది వరకు పనిచేస్తున్నారు. ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న వీరికి నెలకు రూ.18 వేల వేతనం ఇస్తున్నారు. వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని అప్పటి నుంచి ప్రభుత్వాలను కోరుతున్నారు. గతంలో వేతనాలు పెంచుతామని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ యాజమాన్యం హామీ ఇచ్చినా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి సానుకూలమైన స్పందన రాలేదు. దాంతో చాలీచాలని వేతనాలతోనే పని చేస్తూ దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారు. ప్రభుత్వం పట్టించుకోకపోయినా కరోనా సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి విధులను నిర్వర్తించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సమస్యలు తీరుతాయని ఆరోగ్యమిత్రలు భావిస్తున్నారు. అందులో భాగంగా డిసెంబర్ 8న సీఎం రేవంత్‌ను కలిసి సమస్యలను కలిసి నాయకులు వివరించారు. డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి దామోదర రాజనరసింహ, ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ సీఈఓలను సైతం కలిసి కూడా వినతులు ఇచ్చారు. అయినా ఇప్పటి వరకు సమస్యలు పరిష్కారానికి నోచలేదని వాపోయారు.



ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న ఆరోగ్యమిత్ర

రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలి



నేను 8 సంవత్సరాల నుంచి ఆరోగ్య మిత్రగా పనిచేస్తున్నా. మమ్మల్ని రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలి. కనీసం వేతనం రూ.22,750లకు పెంచాలి. మా వేతనాలను నేరుగా ట్రస్టే చెల్లించాలే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఔట్ సోర్సింగ్ సిబ్బందిగా కాకుండా కనీసం కాంట్రాక్ట్ ఎంప్లాయిగా మమ్మల్ని గుర్తించాలి.

– హిమగిరి ప్రసాద్, ఆరోగ్య మిత్ర

డిమాండ్లు ఇవే..

ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న ఆరోగ్య మిత్రలను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలి. డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ క్యాడర్ ఇవ్వాలి. జీఓ 60 ప్రకారం వేతనాన్ని రూ. 22,750కు పెంచాలి. రాబోయే పీఆర్సీలో కనీస వేతనం రూ. 35 వేలుగా నిర్ణయించి, టీఏ, డీఏ ఇవ్వాలి. వేతనాలను ఏజెన్సీ ద్వారా కాకుండా నేరుగా ట్రస్టు ద్వారా చెల్లించాలి. ఔట్ సోర్సింగ్ సిబ్బందిగా కాకుండా కనీసం కాంట్రాక్ట్ ఉద్యోగులుగా అయినా ప్రకటించాలి. మొదటి నుంచి పీహెచ్‌సీలలో పని చేస్తున్న వారిని ఇతర ఆస్పత్రులకు మార్చకుండా కొనసాగించాలి. ఉద్యోగులందరికీ హెల్త్‌కార్డులివ్వాలి. విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగ అవకాశం కల్పించాలని వారు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికకు పోలింగ్**

నారాయణఖేడ్: పద్మశాలీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడిని ఎన్నుకునేందుకు గాను ఆదివారం నారాయణఖేడ్ మార్కండేయ భవన్‌లో పోలింగ్ నిర్వహించారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు జరిగింది. ఖేడ్ నియోజకవర్గంలోని ఓటర్లయిన పద్మశాలీ సంఘ సభ్యులు బారులుదీరి తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. రాష్ట్ర అధ్యక్ష పదవికి పలువురు తీవ్రంగా పోటీ పడుతుండగా రాష్ట్ర స్థాయిలో ఒక కులసంఘానికి ప్రజాస్వామ్య పద్ధతిలో ఓటింగ్ జరగడం ఇదే మొదటిసారని స్థానిక పద్మశాలీ సంఘ బాధ్యులు తెలిపారు.

◆ **నగర సంకీర్తన**

జహీరాబాద్ టౌన్: హరే కృష్ణ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఆదివారం నగర సంకీర్తన భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని భక్తులు హౌసింగ్ బోర్డు హనుమాన్ మందిరానికి చేరుకున్న భక్తులు అక్కడి నుంచి భజనలు, కీర్తనలు చేస్తూ పాదయాత్ర చేశారు. హనుమాన్ మందిరం నుంచి వీధుల గుండా ప్రధాన రహదారి ద్వారా కొనసాగింది. కార్యక్రమం తరువాత నిర్వాహకులు భక్తులకు అల్పాహారం అందజేశారు.

◆ **ఘనంగా బోనాలు**



రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలో ఆదివారం శ్రావణమాస బోనాలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ ఐదుగుళ్ల పోచమ్మ తల్లి దేవాలయంలో బోనాల పండుగను నిర్వహించారు. పోతరాజుల విన్యాసాలు అలరించాయి. రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్పనగేశ్ కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి బోనం సమర్పించారు.

నేడు ప్రత్యేక పూజలు

పటాన్‌చెరు టౌన్: శ్రావణ సోమవారం నేపథ్యంలో శివాలయాలు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. పటాన్‌చెరు పాత టోల్‌గేట్ సమీపాన ఉన్న రామలింగేశ్వర దేవస్థానం, జేపీ కాలనీలోనే ఉమామహేశ్వర దేవస్థానం, చైతన్య నగర్ కాలనీలో ఉన్న మహదేవుని ఆలయంలో సోమవారం తెల్లవారుజాము 5 గంటలకు స్వామికి అభిషేకంతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని తెలిపారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



రాజిరెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

హత్నూర (సంగారెడ్డి): రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ. 2 లక్షల రుణ మాఫీ చేసి దేశ చరిత్రలో ఆదర్శంగా నిలిచారని కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్‌లు అన్నారు. ఆదివారం మండలంలోని తార్యాన్ పేట్ గ్రామ బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ చంద్రగౌడ్ ఆధ్వర్యాన రాజిరెడ్డి, ఆంజనేయులు సమక్షంలో బీఆర్ఎస్‌కు చెందిన మహేశ్ గౌడ్, శ్రీశైలంతో పాటు 20 మంది క్యాంప్ ఆఫీస్‌లో కాంగ్రెస్‌లో చేరినట్లు పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కృష్ణ తెలిపారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో రైతులకు కనీసం మద్దతు ధర ఇవ్వలేదన్నారు. రైతులకు రుణమాఫీ రెండు లక్షల వరకు చేసిన ఘనత రేవంత్ రెడ్డిదేనని అన్నారు. కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధిని కార్యక్రమాలను చూసి ఇతర పార్టీల మండల గ్రామస్థాయి నాయకులు పార్టీలోకి రావడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హత్నూర మండల అధ్యక్షుడు కరే కృష్ణ ముదిరాజ్, నాయకులు కొన్యాల వెంకటేశ్, యాదగౌడ్, సందీప్, ప్రసాద్, పాల్గొన్నారు.

చర్చికి వెళ్తుండగా కబళించిన మృత్యువు

- బైక్‌ను ఢీకొన్న బస్సు, విశ్రాంత టీచర్ మృతి

జహీరాబాద్: రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఉపాధ్యాయురాలు మృతిచెందింది. ఈ సంఘటన 65వ జాతీయ రహదారిపై జరిగింది. ఎస్.ఐ కాశీనాథ్ కథనం ప్రకారం.. ఆదివారం జహీరాబాద్ మండలం అల్లీపూర్‌కు చెందిన సువర్ణ(76), మేస్త్రీ బాబు ద్విచక్ర వాహనంపై చర్చికి వెళ్తున్నారు. 65వ జాతీయ రహదారిపై దర్గా వద్ద కర్ణాటకకు చెందిన ఆర్టీసీ బస్సు వెనుక నుంచి వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఇద్దరు కింద పడిపోయారు. బస్సు ముందు చక్రం సువర్ణ తలపై నుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి కుమారుడు భూషణ్ దీపక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని జహీరాబాద్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



సువర్ణ(ఫైల్)

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

జోగిపేట(అందోల్): వ్యక్తి అనుమానాస్పద స్థితిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన జోగిపేటలో ఆదివారం జరిగింది. ఎస్ఐ పాండు తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన నారాయణ(53)కు కుమారులు వీరేశం, కృష్ణ ఉన్నారు. వీరేశం వద్ద తండ్రి ఉంటున్నాడు. వీరిద్దరూ రోజూ మద్యం తాగుతారు. ఆదివారం వీరేశం అందోల్ మండలం తాలెల్మ గ్రామానికి వెళ్లి తాను కల్లు తాగి తండ్రి కోసం తెచ్చాడు. మరలా ఇద్దరూ కలిసి తాగి నిద్రించారు. సాయంత్రం కుమారుడు నిద్ర లేచి చూస్తే తండ్రి పక్కన కనిపించలేదు. వేరే గదిలో ఉన్నాడేమోనని చూస్తే అప్పటికే ఉరి వేసుకొని మరణించడాన్ని గమనించాడు. తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడంటూ అతను చుట్టు పక్కల వారికి తెలిపాడు. వారు ఇతనే చంపి ఉంటాడన్న అనుమానంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కొన్ని రోజులుగా తన తండ్రి ఆరోగ్య పరిస్థితి బాగా లేదని ఆయనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి మరో కుమారుడు కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



నారాయణ (ఫైల్)

తండాను పంచాయతీని చేయాలి

- రోడ్డుపై తండావాసులు బైఠాయింపు

కొడిపల్లి(నర్సాపూర్): తండాను ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం మండలంలోని ముట్రాజ్‌పల్లి సింగమ్రితండా వద్ద తండావాసులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తండాలను పంచాయతీలుగా చేయగా తమ తండాను పంచాయతీగా ఏర్పాటు చేయలేదన్నారు. దీంతో ముట్రాజ్‌పల్లి పంచాయతీ పరిధిలోని సింగమ్రితండా, కిష్టరేగడితండా, తాళ్లగడ్డతండాలను కలిపి ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలని గత ఏడాది అప్పటి ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశామన్నారు. ఆమేరకు జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారన్నారు. కాగా ప్రస్తుతం కొత్తపంచాయతీలు ఏర్పాటు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం గెజిట్ విడుదల చేయగా.. తమ పంచాయతీ పేరు లేదన్నారు. రెండుసార్లు తమకు మొండిచేయి చూపారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి.. కొత్తగా గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయమై కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు.

క్యాండిల్ ర్యాలీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కోల్‌కత్తాలో మహిళ వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య ను ఖండిస్తూ రామచంద్రాపురం, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు శనివారం రాత్రి క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో తెల్లాపూర్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిలకమర్రి ప్రభాకర్ రెడ్డి, గేటెడ్ కమ్యూనిటీ కాలనీవాసులు పాల్గొన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశంలో ఇలాంటి సంఘటనలు జరగకుండా కఠిన చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రామచంద్రాపురం పట్టణంలో రమణ ఆధ్వర్యంలో యువకులు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గసభ్యుడు బలరాం పాల్గొన్నారు.



తెల్లాపూర్‌లో క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

కలుపు కష్టాలు

- కూలీలకు డిమాండ్
- పెరుగుతున్న పెట్టుబడులు



పత్తి చేనులో కలుపు తీస్తున్న కూలీలు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ వ్యవసాయ డివిజన్‌లో పంట పొలాల్లో కలుపుతీత పనులు జోరుగా సాగుతున్నాయి. కూలీల కొరత వల్ల వారికి డిమాండ్ ఉంది. కలుపు తీసేందుకు కూలీలు దొరక్క రైతులు అవస్థలు పడుతున్నారు. కూలీ రేట్లు పెంచడం వల్ల పెట్టుబడులు పెరిగి నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. జహీరాబాద్ వ్యవసాయ డివిజన్ పరిధిలోని జహీరాబాద్, న్యాల్‌కల్, ఝరాసంగం, కోహీర్ మండలాల్లో రైతులు వానాకాలం సీజన్‌లో పత్తి, సోయాబిన్, పెసర, కంది, మినుము తదితర పంటలను సాగు చేశారు. సుమారు 75 వేల ఎకరాల్లో పత్తి, 45 వేల ఎకరాల్లో సోయాబిన్, 6,617 ఎకరాలో మినుము, 11,203 ఎకరాల్లో పెసర పంట సాగవుతోంది. ప్రారంభం నుంచి వానలు పడుతున్నందున పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పంటలతో పాటు కలుపు మొక్కలు పెరిగాయి. ముఖ్యంగా పత్తి చేన్లల్లో విపరీతంగా కలుపు పెరడంతో నివారణకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో ఉన్న పత్తి చేన్లలో నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో నీటి తడి ఆరకుండా మొక్కల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. మరో పక్క కలుపు విపరీతంగా పెరిగిపోవడంతో రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. సస్యరక్షణ చర్యలు చేపట్టేందుకు వెసులుబాటు లేక కలుపు తీసేందుకు కూలీలు దొరక్క అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కూలీల కొరత వల్ల కొంత మంది కలుపు నివారణ మందులపై ఆధారపడుతున్నారు. కూలీల ధరలు పెరగడంతో పెట్టుబడి ఖర్చులు అధికమవుతున్నట్లు వాపోతున్నారు. జహీరాబాద్ ప్రాంతంలో దినసరి కూలీ రూ. 400 ఉండగా రూ. 600 చెల్లించాల్సి వస్తుంది. ఎకరం పొలంలో కలుపు తీసేందుకు రూ. 5 వేల నుంచి రూ. 7 వేల వరకు ఖర్చు అవుతోంది. పంటల సాగు విస్తీర్ణం పెరగడంతో కూలీల కొరత నెలకొంది. స్థానికంగా కూలీలు దొరక్క దూర ప్రాంతాల నుంచి రప్పించుకుంటున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే కూలీలకు రవాణా ఖర్చు కూడా రైతులు భరించాల్సి వస్తుంది.


పెట్టుబడులు పెరుగుతున్నాయి



పత్తితోపాటు ఇతర పంటల్లో కలుపు తీసేందుకు కూలీలు కొరత వల్ల ఇబ్బందులు పడుతున్నాం. కలుపుతీత కోసం భారీగా ఖర్చు చేయాల్సి వస్తుంది. దీంతో పెట్టుబడులు పెరుగుతున్నాయి.

– డి.శివకుమార్, రైతు, ఎల్గోయి

నీరు వృథా.. తీరని వ్యథ



వృథాగా పోతున్న నీరు

బోరు మోటారు నీరు రోడ్డు పాలు అవుతున్నాయి. పట్టణంలోని బాగారెడ్డిపల్లి, శాంతినగర్ కాలనీలో బోరు మోటార్లు ఉన్నాయి. బాగారెడ్డి పల్లి మోటారు పాడైపోగా.. శాంతినగర్‌లో ఉన్న మోటార్ ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. కానీ అక్కడ పైపునకు వాల్ లేకపోవడంతో నీరు వృథాగా పోతోంది. సీపీఐ కార్యదర్శి నర్సింహులు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా సాయంత్రం మోటార్ ఆఫ్ చేశారు.

–జహీరాబాద్ టౌన్

మురుగు.. పరుగు



జాతీయ రహదారిపై పారుతున్న వర్షపు నీరు

కంది మండల కేంద్రంలో మురుగు కాల్వలు లేక నీరంతా జాతీయ రహదారిపై పారుతోంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ పరిధిలో కొత్తగా ఏర్పాటైన కాలనీలకు మురుగు కాల్వలు ఏర్పాటు చేయలేదు. దీనికి తోడు మురుగునీరుతో కలిసి వర్షపు నీరు రోడ్డుపై పారుతోంది. దీంతో గుంతలు కానరాక వాహనదారులు అందులో పడి గాయాలపాలవుతున్నారు. అధికారులు స్పందించి జాతీయ రహదారి పక్కన కాలువలు నిర్మించాలని కోరుతున్నారు.

– కంది(సంగారెడ్డి)